క్లుప్తంగా

మతం కన్నా మానవత్వమే గొప్పది



సభలో మాట్లాడుతున్న దివ్యానంద సరస్వతి

కరప: మతం కన్నా మానవత్వమే గొప్పదని, అటువంటి మానవత్వాన్ని నేర్పింది హిందూ ధర్మమేనని గీతాశ్రమం దివ్యానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. మండలం పెనుగుదురులోని సంతోషిమాతా ఆలయ ప్రాంగణంలో శనివారం మండల సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ముందుగా వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన హైందవ సమూహాలు, అధ్యాత్మిక కళా ప్రదర్శనలు, భజనలతో శోభాయాత్ర నిర్వహించారు. గోదావరి జోన్ ధర్మ సహ కన్వీనర్ బండ్ల రామ్‌శంకర్, జోన్ ధర్మప్రచారక్ జగన్నాథం, ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగం ప్రచార ప్రముఖ్ నండూరి కృష్ణ, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్నామణి జీవితం ఆదర్శనీయం



అన్నామణి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: విద్యావేత్తగా నలుగురికి ఆదర్శంగా నిలిచి, ఎందరినో విద్యావంతులు చేసిన విశ్రాంత ఎంఈఓ, రచయిత్రి అన్నామణి విలియమ్స్ జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రాయుడుపాలెంలో సీటీసీ చర్చి ప్రాంగణంలో అన్నామణి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఎంఎస్ విలియమ్స్, స్టీఫెన్ ఆనంద్ తదితరులను పరామర్శించారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పకడ్బందీగా చేయాలి



కరపలో కులగణన, ఆడుదాం ఆంధ్ర క్రీడలపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: మండల పరిధి గ్రామాల్లో కులగణన సర్వే పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయం అసిస్టెంట్లతో సమావేశమై కులగణన సర్వేపై సమీక్షించి, అనుసరించాల్సిన విధి, విధానాలపై సూచనలిచ్చారు. గ్రామ వలంటీర్లతో ఇంటింట సర్వే నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పొందుపరచాలన్నారు. తర్వాత గ్రామ, మండలస్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర్వహణపై సమీక్షించారు.

జీజీహెచ్‌లో బాలల వారోత్సవం

కాకినాడ క్రైం: బాలల దినోత్సవానికి కొనసాగింపుగా జీజీహెచ్‌లో బాలల వారోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా బాలల ఆరోగ్యాన్ని పెంపొందించే పలు అంశాలపై ప్రణాళికాబద్ధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ) పరిధిలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కడలి సత్యనారాయణ పర్యవేక్షణలో డీఈఐసీ జిల్లా మేనేజర్ దంగేటి బిందుమాధవి ఆధ్వర్యంలో బాలల తల్లులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి పుట్టుకతో వచ్చే లోపాలు, నివారణ, సమతులాహారం, పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల తల్లులతో పాటు పీడియాట్రీషియన్లు ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ బుర్రి రాంబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కాకినాడ రూరల్: కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం, కార్తిక వనసమారాధన జిల్లా కార్యవర్గ ఎన్నిక శనివారం అచ్చంపేట జంక్షన్‌లోని తోటలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబు అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, రాష్ట్ర సలహాదారులు కోన చిన్నారావు, తూర్పుగోదావరి జిల్లా నూతన అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు గౌరవ అతిథులుగా పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కొప్పాడి శివ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ తానీషా, కోశాధికారిగా యలమంచిలి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ అధ్యక్షులు సీహెచ్ ఏడుకొండలు వందన సమర్పణ చేశారు. గౌరవ అతిథులను, వైద్యులకు సత్కారం చేశారు.

సౌకర్యవంతంగా సుదూరాలకు

- అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ సర్వీసులు
- ప్రైవేటు బస్సులకు దీటుగా సేవలు
- సరిహద్దు రాష్ట్రాలతో ఒప్పందాలు

నిర్ణయించిన ధరలు

బస్సు	సామర్థ్యం	కిలోమీటరుకు
సూపర్ లగ్జరీ	36	రూ.57
అల్ట్రా డీలక్స్	40	రూ.61
ఎక్స్‌ప్రెస్	50	రూ.62
పల్లె వెలుగు	56	రూ.52
ఇంద్ర ఏసీ	40	రూ.79
గరుడ ఏసీ	41	రూ.89
అమరావతి వోల్వో	48	రూ.120



కాకినాడ ఆర్టీసీ డిపో

కాకినాడ: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ఏపీఎస్ ఆర్టీసీ ఇప్పుడు సుదూర ప్రాంతాలకు అద్దె ప్రాతిపదికన బస్సులను ఇచ్చేందుకు సిద్ధమైంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలతో సరిహద్దు రవాణా ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ విహార, వివాహ, తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకుంది. కోరుకున్న ప్రాంతం నుంచి ఎంత దూరమైనా నిర్దేశించిన ధర చెల్లిస్తే అద్దె ప్రాతిపదికన బస్సులను అందిస్తోంది. కార్గో రవాణాలో కూడా రాణిస్తున్న ఆర్టీసీ ఇప్పుడు ప్రజలకు మరింత చేరువవుతోంది.

ఒరిస్సా, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌తో పాటు అనేక రాష్ట్రాలకు ఈ విధానంలో బస్సులను పంపేందుకు సమాయత్తమవుతోంది. రోజుకు నిర్ణీత కిలోమీటర్లు ప్రయాణించాలన్న నిబంధనతో పాటు ఇతర ఖర్చులను ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. ఇక పెళ్లిళ్లకు వెళ్లేందుకు కూడా ఈ బస్సులను ప్రైవేటు ట్రావెల్స్ కన్నా వెసులుబాటు ధరను నిర్ణయించింది.

తీర్థయాత్రలకు..

కార్తికమాసం నేపథ్యంలో పంచారామాల సందర్శనకు అద్దె ప్రాతిపదికన రెగ్యులర్ టికెట్ విధానంపై కూడా బస్సులను నడుపుతోంది. ప్రతి శని, ఆదివారాల్లో అయితే టిక్కెట్‌ధరపై వెళ్లే అవకాశం ఉండగా, ఎక్కువ మంది ముందుకు వస్తే కిలోమీటరు ప్రాతిపదికన, అద్దె ప్రాతిపదికన బస్సులు ఇవ్వనుంది. శబరిమలై, శ్రీశైలం వంటి ప్రాంతాలకు ఈ సేవలు అందిస్తోంది.

సద్వినియోగం చేసుకోండి



దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ కల్పించిన మెరుగైన రవాణా సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు ట్రావెల్స్ కన్నా తక్కువ ధరను నిర్ణయించి బస్సులను నడుపుతున్నాం. ముందుగా ఆర్టీసీ కార్యాలయానికి వచ్చి అక్కడి రిజర్వేషన్ సిబ్బందితో చర్చించి కావలసిన ప్రాంతం, తేదీకి బస్సులను బుక్ చేసుకోవచ్చు.

– ఎం. శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణాధికారి, కాకినాడ

ఎన్ని కిలోమీటర్లంటే..

దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సును అద్దె ప్రాతిపదికన తీసుకోవాలంటే రోజుకు 480 కిలోమీటర్ల ప్రయాణానికి ధర చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొమ్ముకు 5 శాతం జీఎస్టీతో పాటు, టోల్‌గేట్లు, పార్కింగ్ ఫీజులు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. శబరిమల వెళ్లేందుకు మాత్రం ప్రత్యేక రాయితీ ఇచ్చి రోజుకి 420 కిలోమీటర్లు ప్రయాణించేలా నిర్ణయం తీసుకున్నారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): గ్రామ పంచాయతీ చట్టాలపై కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య అన్నారు. స్థానిక జెడ్పీ సమావేశమందిరంలో శనివారం జిల్లాలోని ఈవోపీఆర్డీలు, ఎంపిక చేసిన గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ జీవోలపైన కూడా కార్యదర్శులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. అనంతరం డీపీఓ గ్రామ పంచాయతీ చట్టాలపై ఓరియంటేషన్ నిర్వహించారు. జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి గ్రామ పంచాయతీ సమావేశాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పెద్దాపురం డీఎల్‌పీఓ బాలామణి, కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి జిల్లాలోని వివిధ మండల ఈవోపీఆర్డీలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 15వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నిరంతరం ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 15వ డివిజన్ ఏటిమొగ ముల్లా రమ్మగుడి సమీపంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి ప్రచారబోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితర ప్రముఖులు హాజరయ్యారు. గత టీడీపీ పాలనను–ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకుని ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. మరో 140 రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ, జనసేన వంటి పార్టీలు ముందుకు వస్తున్నాయని, వీరి అబద్ధాలను, మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నవరత్న పథకాల ద్వారా ప్రతి హామీని అమలు చేసిన సీఎం జగన్ పరిపాలనను ప్రజలు స్వాగతించాలన్నారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్ పినపోతు సత్తిబాబు, నల్లబెల్లి సుజాత, మీసాల దుర్గాప్రసాద్, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఎస్.అచ్యుతాపురంలో గడప గడపకూ..



48వ డివిజన్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శనివారం సాయంత్రం కాకినాడ అర్బన్ 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబంలోను లబ్ధిదారులు ఉన్నారని, సంక్షేమానికి అర్థం చెప్పేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 31వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, మరో 4 నుంచి 5 వేల మందికి నెల రోజుల్లోగా అందజేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెదపాటి నాగబాబు, సిల్లి దేవరాజు, జయకుమార్, కేబుల్ రమణ, చిన్ని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో తూర్పు కైవసం



బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించిన తూర్పుగోదావరి జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో జేఎన్టీయూకేలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–17 ఖోఖో పోటీల్లో బాలికల విభాగంలో తూర్పుగోదావరి జట్టు విజేతగా నిలిచింది. బాలుర జట్టు రన్నర్స్‌గా నిలిచింది. పోటీల ముగింపోత్సవానికి ఆర్‌జేడీ నాగమణి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. బాలికల విభాగంలో నెల్లూరు ద్వితీయ, పశ్చిమ గోదావరి తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో ప్రకాశం ప్రథమ, విశాఖ జట్టు తృతీయ స్థానాన్ని సాధించాయి. ఏఎస్పీ సత్యన్నారాయణ, డీఎస్ఏ సీఈఓ శ్రీనివాస్‌కుమార్, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు



ఎన్నికల పర్యవేక్షణ అధికారులు, బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఈఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: వచ్చే ఏడాదికి 18 ఏళ్లు నిండుతున్న యువత ఓటర్లుగా నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆర్డీఓ, రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో) ఈట్ల కిశోర్ కోరారు. రమణయ్యపేటలో మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ఎన్నికల పర్యవేక్షణ అధికారులు, బీఎల్‌ఓలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ముసాయిదా ప్రకారం ఓటర్ల మార్పులు, చేర్పులు, అభ్యంతరములపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటర్ల నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఈశ్వర్‌నగర్‌లో మోహన్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. కాకినాడ రూరల్, కపర తహసీల్దారులు వి.మురార్జీ, పి.శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

యువత తప్పని సరిగా ఓటు హక్కు నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ శ్రీరమణి పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో మోహన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటు హక్కుపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని తహసీల్దార్ మురార్జీ ఆధ్వర్యంలో మోహన్ విద్యాసంస్థల అధినేత మల్లారెడ్డి మోహన్ రావు అధ్యక్షతన అవగాహన కల్పించారు. డీటీలు రావు కళ్యాణ్ చక్రవర్తి, యడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో నేటి నుంచి గిఫ్ట్ స్కీమ్

కాకినాడ: కాకినాడ డిపో నుంచి కోటిపల్లి, కోటనందూరు పరిధిలో తిరిగే అన్ని బస్సులకు గిఫ్ట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్టు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం యూవీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణం అనంతరం టిక్కెట్ వెనుక ఫోన్‌నెంబర్, అడ్రస్ రాసి బస్సులోని గిఫ్ట్‌బాక్సులో వేయాలన్నారు. ప్రతి 15 రోజుల కొకసారి ఈ బాక్సును తెరచి లాటరీ తీసి ఇద్దరికి బహుమతులు అందజేస్తామన్నారు.

ఇండస్ట్రీ 4.0 మార్కెటింగ్ ట్రెండ్స్‌పై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్

కాకినాడ రూరల్: ఇండస్ట్రీ 4.0 మార్కెటింగ్ ట్రెండ్స్ అనే అంశంపై జాతీయ సదస్సును నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో నిర్వహించారు. కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్‌ఓడి డాక్టర్ డి.అజయ్ రతన్ సమన్వయకర్తగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని నవయుగం సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడి ఉందని, ప్రతి విద్యార్థి సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కేఎల్ వర్సిటీ ప్రొఫెసర్ ఎం కిషోర్‌బాబు ముఖ్య వక్తగా పాల్గొని ఇండస్ట్రీ 4.0 కొత్త నవశక పారిశ్రామిక అభివృద్ధి వీటిలో కొత్త ఉత్పత్తులను ఎలా లాంచ్ చేయాలి, మార్కెటింగ్ అంశాలను వివరించారు. క్యాంపస్ డీసీఎంఎస్ అధ్యాపకుడు డాక్టర్ ఎం.శ్రీ రామరాజు, డాక్టర్ కే.అనిల్ అంబిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశక్తి యాగం



లలితా అమ్మవారికి హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి



దీపారాధన చేస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీ పీఠంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని తరిస్తున్నారు. పరిపూర్ణానంద స్వామి పర్యవేక్షణలో శత కోటి కుంకుమార్చనకు వేలాదిగా మహిళలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి తరలివస్తున్నారు. శనివారం ఉదయం నక్షత్ర పూజ, తిథి పూజ, లలితా కుంకుమార్చనలు, సాయంత్రం కోటి దీపోత్సవం, బగళాముఖి హోమం నిర్వహించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వేళంగి లైబ్రరీ ఆవరణలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించినట్టు లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతి, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు ఈ నెల 20వ తేదీన బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ తెలిపారు. జూనియర్ కళాశాల లైబ్రేరియన్ ఎస్.సుబ్బారెడ్డి, హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు కుమార్‌దేవ్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, ఎర్రా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అక్రమ సరకు జప్తు

కాకినాడ సిటీ: పౌరసరఫరాల అధికారులు నమోదు చేసిన పలు 6ఏ కేసులను జేసీ ఇలక్కియ శనివారం విచారించి రూ.3.23 లక్షల విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అక్రమ రవాణాకు వినియోగించిన వాహన యాజమానిపై రూ.15 వేలు జరిమానా విధించారు. పెట్రోలు బంకు యజమానికి రూ. 10 వేల జరిమానా విధించారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా పితాని లీలావతి

కాకినాడ రూరల్: బీజేపీ కాకినాడ రూరల్ అసెంబ్లీ కన్వీనర్‌గా పితాని లీలావతి, కో కన్వీనర్‌గా ఘంటసాల గోవిందును నియమించారు. తమను నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, జోనల్ ఇంచార్జ్ కాశీ విశ్వనాథరాజు, జిల్లా ఇన్‌చార్జి కోడూరి లక్ష్మీనారాయణ తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల

కరప: మండల పరిధిలో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ అధికారులకు సూచించారు. మండలం కరప, కూరాడ గ్రామాల్లో శనివారం ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలసి పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. కరపలోని సీతమ్మ వీధిలో రూ.కోటితో నిర్మిస్తున్న బీసీ సామాజిక కల్యాణ మండపం, అంబేడ్కర్‌నగర్–1లో నిర్మిస్తున్న మండల అంబేడ్కర్ కళ్యాణమండపం పనులను పరిశీలించారు. సామూహిక రక్షిత నీటి చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించగా ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ పనుల ప్రగతిని వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో కరప, నడకుదురు, పాతర్లగడ్డ గ్రామాలకు కొత్తగా ఎంపికైన వలంటీర్లకు ఆయన నియామక పత్రాలను అందజేసి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కూరాడలో పర్యటించి, తాగునీటి చెరువు చుట్టూ నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ గురించి అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి కొండ, వి.రామారావు, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్‌కప్ ఫైనల్స్‌కు భారీ స్క్రీన్



క్రీడాభిమానులను ఆహ్వానిస్తూ ఎమ్మెల్యే కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద చేస్తున్న ప్రచారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరగనున్న వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు కాకినాడ రంగారాయ వైద్య కళాశాల క్రీడా మైదానం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి నవీన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌ఎంసీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 10 వేల మంది ఈ మ్యాచ్‌ను చూసేందుకు వీలుగా క్రీడామైదానంలో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ నర్సింహం ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని పేర్కొన్నారు.

క్రికెట్ ప్రేమికులకు ఆహ్వానం

కాకినాడ రూరల్: విశ్వ విజేతగా భారత్ నిలిచేందుకు వరల్డ్ కప్ ఫైనల్ పోరుకు మరి కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. ప్రపంచ్ కప్‌ను భారత్ గెలుచుకోవాలని యావత్ భారత్ ప్రజలు ఎదురు చూస్తున్నారు. వరల్డ్ కప్ పోరులో లీగ్ నుంచి సెమీస్ దాకా పరుగుల వర్షం కురిపించి నంబరు వన్ స్థానంలో నిలిచి తుది పోరులో భారత్ ఆస్ట్రేలియాతో తలపడనుంది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎక్కడ చూసినా క్రికెట్ ఫీవర్ నెలకొగా ఆదివారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరగనున్న ఫైనల్‌ను ఆసక్తిగా తిలకించేందుకు క్రికెట్ అభిమానులు ఏర్పాట్లు చేసుకున్నారు. టీవీల ముందుకు అతిక్కుపోయి కూర్చునేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేలా లైవ్ స్ట్రీమింగ్‌ను ఏర్పాటు చేశారు. బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌ను వీక్షించేందుకు అభిమానులు తరలిరావాలని శనివారం ఆయన ఆహ్వానించారు.

ఆధ్యాత్మికవేత్తలే హీరోలు



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తిరాజు, చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

బోట్‌క్లబ్: ఆధ్యాత్మిక కోణంలో నడిచిన వారే హీరో అవుతారని అంతర్జాతీయ వర్తమానికులు డబ్ల్యూఎఫ్ కుముయి అన్నారు. సీవైఎఫ్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు ఆధ్వర్యంలో స్థానిక మెక్లారిన్ స్కూల్‌లో జరుగుతున్న ప్రీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. 10 వేల మంది యువతీ యువకులతో యూత్ రిట్రీట్ నిర్వహించారు. లక్షలాది యువతను ప్రోత్సహించి ప్రభువును పరిచయం చేయడంలోను, వ్యక్తిగత వికాసం వైపు నడిపించడం నా జీవితానికి ఎంతో తృప్తినిచ్చిందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు స్థాపించిన కుముయి ప్రపంచంలోనే అనేక మందికి ఆదర్శప్రాయంగా నిలబడ్డారన్నారు. ప్రముఖ గాయని ఎంఎం శ్రీలేఖ, అలెన్ గంటా, సువార్త గాయకురాలు క్వీని విక్టోరియా గీతాలు ఉర్రూతలూగించారు. ఏపీ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీని సత్కరించారు. రక్షణ టీవీ సీఎండీ జక్కుల బెన్హర్, రిక్కీ గూటం, జోసఫ్ బెన్నీ, జాషువా గిరి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర నిర్వహణకు పటిష్ట ప్రణాళిక

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్–2023ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఈ కార్యక్రమంపై వివిధ విభాగాధిపతులు, ప్రత్యేకాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 3వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయిలో జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 21వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, బ్యాట్మింటన్ డబుల్స్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల నిర్వహణకు ప్రతి సచివాలయం నుంచి ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ ఇస్తామన్నారు. నగరపాలక సంస్థలోని సిటీ నియోజకవర్గ పరిధిలో 86 సచివాలయాలను మూడు మండలాలుగా విభజించి ప్రతి సచివాలయ పరిధిలో పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోటీల నిర్వహణకు అవసరమైన ఆటస్థలాలను గుర్తించి మైదానాలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. స్పోర్ట్స్ అథారిటీ సీఈవో శ్రీనివాస కుమార్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, తహసీల్దార్ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.